# ఆచంట జానకిరామ్



# నా స్మృతి పథంలో...

## సాగుతున్న యాత్ర

# నా స్మృతి పథంలో...

ఎన్ని జ్ఞాపకాలో ! వద్దు అనుకున్నా ముసురుకొని వస్తాయి జ్ఞాపకాలు. ఎన్నని ! ఏభై ఏళ్ళ జీవితపు విషయాలెన్నో 'నేను ముందు' 'నేను ముందు' అనుకుంటూ వస్తాయి.

అన్నిటి కంటె ముందు మా అమ్మను గురించిన జ్ఞాపకం. ఎప్పటి మాట ! నాకు నాలుగో ఏట అనుకుంటాను! నాన్నలా ఉండాలని పొడుగు కోటు తొడుక్కుని బడాయిగా ఇటూ అటూ పచారు చేస్తుండగా నాన్న, అమ్మ నన్ను చూచి నవ్వుకొన్న జ్ఞాపకం, పార్థసారథి కోవిలలో ప్రభల ఉత్సవం చూచిన జ్ఞాపకం. అప్పుడే కొత్తగా అవతరించిన పార్శీ నాటకంలో సీను మీద నిగనిగ లాడే ఎర్రని పూలతో విరగ పూసిన దానిమ్మ చెట్టు–అబ్బ! ఎంత అందంగా ఉంది! ఇవన్నీ ఎప్పటి కబుర్లు! ఏదో ఆటలో చిన్న గాయం తగిలి, రక్తం వస్తే ఎంత భయపడి పోయింది, అమ్మ.... నాకోసం ఎంత తాపత్రయ పడింది! అదే ఆమెను గురించిన ఆఖరి జ్ఞాపకం.... తర్వాత, ఆమె మనకు దక్కకుండా పోయింది.

అమ్మ తర్వాత, ఈ జీవితంలో ఎందరెందరు ప్రవేశించారో !

కవులు, రాజులు, కాంతామ తల్లులు,

యుద్ధ వీరులు, రాజ్యాంగవేత్తలు,

ప్రాణమును కూడ బలి యిచ్చే నేస్తగాండ్రు – ఎందరో వచ్చి వెళ్ళారు ఈ జీవితంలోకి. ఒక్కొక్కరు క్షణ కాలమో కొన్ని ఏళ్లో ఈ జీవిత ప్రాంగణంలో మసలి, చక్కా వెళ్ళారు. ఎంత వన్నె తెచ్చారో, ఈ నిరుపేద జీవితానికి. కాని, నిరుపేద ఎల్లా అవుతుంది? గోపాలకృష్ణ గోఖలే ఉపన్యాసం వింటూ అతని సౌజన్యానికి ముగ్ధుడనైన నిమిషం, కోడి రామమూర్తి ఉపన్యాసం అనుకరిస్తూ అతని ఒళ్ళో కూర్చుని ఏనుగును ఛాతీపై ఎత్తుకొన్న శాండో వళ్ళో కూర్చొన్నానని గర్వించిన నిమిషం, వీరేశలింగం పంతులుగారు నాన్నగారితో తమ కష్టాలు చెప్పుకుంటూ ఉండగా విని జాలి పడిన నిమిషం, కాశ్మీర శాలువా గప్పుకొని, వెన్నెల రాత్రిని ఆరుబయట నాన్నగారితో కబుర్లు చెప్పుతూ ఉన్న గురజాడ అప్పారావు గారి ఎదుట గిరీశం "మూన్‌లైట్ బ్రైటటా" అన్న మాటలు వల్లించిన నిమిషం, ఎన్నని ! అమూల్యమైన అనుభవాలు.

"అమరావతిని బౌద్ధులు విశ్వవిద్యాలయము స్థాపించునాడు" అన్న పద్యం అవతరించిన మహాసభలో –1914 అనుకుంటాను – ఆంధ్రత్వం నాట్యమాడింది. కన్నులారా చూస్తూ గర్వించాను. హేమా హేమీలైన సర్ బి.ఎన్.శర్మ, మోచర్ల రామచంద్రరావు – వీరి పంక్తిని భోజనం చేస్తూ పెద్దవాళ్ళు చర్చించుకుంటున్న

రాజకీయ విషయాలను అవగాహన చేసుకున్నాను. 'వందేమాతరం' ఆందోళనను గమనిస్తూ దేశభక్తితో మైమరచాను. దక్షిణాఫ్రికాలో గాంధీ చేస్తున్న మానవసేవను గురించి చదివి హర్షించాను. గాంధీ, అనీబిసెంట్లు మద్రాస్‌లో మొదటి సమావేశం విక్టోరియా పబ్లిక్ హాలులో – అప్పుడు నేనున్నా నక్కడ.

రవీంద్రనాథ్ టాగూర్ మద్రాసులో మొదటి పర్యాయం ఉపన్యసించినప్పుడు అతని పక్కన నిలుచున్న వాలంటీర్ నేనే. "మెసేజ్ ఆఫ్ ది ఫారెస్టు" చదువుతూ ఆయన సింహగర్జనతో గొంతు సవరించుకున్నది ఇప్పటికీ ప్రతి ధ్వనిస్తూ ఉంటుంది నా మనోవీథిని. జీవితాన్ని అర్థం చేసుకొనే విషయంలో అనీబిసెంట్ పెట్టిన జ్ఞానభిక్ష ఇప్పటికీ ఎంతో బలాన్నిస్తుంది. అప్పుడు ఇంగ్లీషులో నే వ్రాసిన 'వెన్నెలలో దేవాలయం' 'నీటి ఒడ్డున సాయం సమయం' 'మా ఊరి చెరువు' 'కర్షక జీవిత దృశ్యాలు' చదివి ఆమె నన్ను ఆశీర్వదించిన అనుభవం ఎంత విలువైనది!

మొట్టమొదటి సారి జేమ్స్ కజిన్స్‌ను కలుసుకొన్నప్పుడు ఎన్నేళ్ళ నుంచో ఎరిగిన ఆప్తబంధువును కలుసు కొన్నట్లు అనిపించింది గాని, కాలేజీ ప్రిన్సిపాల్ ఎదుట హాజరైనట్టు తోచలేదు. ఇన్నేళ్ళ పరిచయంతోనూ జీవితంలో ఎన్నో వన్నెలు తెలుసుకో గలిగాను, ఆయన సుస్నాంగత్యం వల్ల. ఆయన భార్య వీర వనిత. ఆయన గురు తుల్యుడు.

జేమ్స్ కజిన్స్ వల్లనే దువ్వూరి రామిరెడ్డిగారి రచనలతో పరిచయం కలుగుత; కజిన్స్ వల్లనే మా అడివి బాపిరాజు బావను గురించి తెలుసుకుంట. ఆ తరువాతనే తెలుగు కవులతో పరిచయం.

అవి తెనుగు భాషా ప్రచారంలో మిషనరీ ఉద్యమం సాగే రోజులు. తెలికిచర్ల వెంకట రత్నం, దేవులపల్లి కృష్ణశాస్త్రి, వేదుల సత్యనారాయణ వీరితో అప్పుడప్పుడు తల్లావఝ్ఝుల శివశంకరశాస్త్రిగారు – ఊరూరా తిరిగి మన భాషను గురించి జనులకు చెప్పేవారు. కృష్ణపక్షంలోని పద్యాలూ, యెంకి పాటలూ, కాటూరి వారి 'కవితా సామాగ్రి' వీరు వెళ్ళిన ప్రతి ఇంటిలో మారు మ్రోగుతుండేవి, ఆ రోజులలో. అప్పుడే వేంకట పార్వతీశ కవుల 'ఏకాంత సేవ' కూడా వెలువడింది.

ఇన్నేళ్ళ జీవితంలో ఎన్ని వేల పుస్తకాలు చదివానో, ఇంగ్లీషులో, తెనుగులో. కానీ అవన్నీ ఒక ఎత్తు, ఆనాడు నేను చదివి, అనుభవించిన 'ఏకాంత సేవ' ఒక ఎత్తు ! సూర్యోదయపు వేళ సింహాచలం కొండ ఎక్కుతూ, రాత్రి కురిసిన మంచు నిలిపిన వెండి ముత్యాలతో మెరిసిపోయే పోక మొక్కల మధ్య "ఏదొ విద్యుత్ ప్రభా పుంజ మిపుడు తోచె ఏదొ దివ్యవాద్యస్వన మిపుడు తోచె" అని ఏకాంత సేవలోని పంక్తులు అనుకుంటూ తన్మయుడనై పోయే వాడిని.

మహా పండితుడు ఆచంట వేంకట సాంఖ్యాయన శర్మ గారికి 'ఏకాంత సేవ'తో పరిచయం గలిగించిన ఖ్యాతి నాది ! మొదట వారితో వాదించాను. ఇదివరకు మన భాషలో లేని క్రొత్త అందాలను ఈ కావ్యంలో చూపించగలిగాను వారికి. నా వాదనను అంగీకరించడమే గాకుండా ఆ మరు నాడు వారి వద్దకు వచ్చిన జనమంచి శేషాద్రి శర్మగారికి ఈ కొత్త కావ్యాన్ని చదివి వినిపించారు, సాంఖ్యాయన శర్మ గారు, అందలి రచనా శిల్పాన్ని, భావ సంపదనూ మెచ్చుకుంటూ.

వేంకటసాంఖ్యాయన శర్మగారితో పరిచయమైన కొన్ని నాళ్ళకే గిడుగు రామమూర్తి పంతులుగారితో పరిచయమున్నూ. పర్లాకిమిడిలో వారిని కలుసుకొన్నప్పుడు రెండు మాటలు మాట్లాడానో లేదో – "ఈ అబ్బాయిది పశ్చిమ గోదావరి జిల్లా" అన్నారు. నేను చిరునవ్వు నవ్వుతుంటే "కాదు ! 'మాది మద్రాస్' అంటావేమో ! నీ మాట స్వచ్ఛమైన పశ్చిమగోదావరి మాట" అన్నారు. ఆ వేళ వారి బల్ల మీదనే చూచాను, పేజీ పేజీకి మాటమాటకీ సవరణలతో నిండిన శబ్ద రత్నాకరం.

●

అరవిందుని నేను మొదట దర్శించినప్పుడు ఆయన ఇంకా రాజకీయ విషయాల చింతనలోనే నిమగ్నులై ఉండే వారు. అప్పుడు కూడా మహా ప్రయత్నం మీదగాని, ఆయనను చూడలేక పోయాం. కాని,మాలో ఏముందో, ఒక సాయం త్రము పది నిముషాలు మాట్లాడినాక "రేపు ఉదయం మళ్ళా రండి, ఇంకా కొంచెం సేపు సావకాశంగా మాట్లాడుకొందాము" అన్నారు. మర్నాడు కలుసుకున్నప్పుడు నేను ఆయనను ఒక వింత ప్రశ్న వేశాను; "ఇప్పుడు మీ వంటి వారంతా భారత స్వాతంత్ర్యానికి పాటుబడుతున్నారు. ఎప్పటికైనా భారత స్వాతంత్ర్యమే లభిస్తే ఆ తరువాత మనం దేని కోసం పాటు పడతాం?" అని అడిగాను.

ఆయన నవ్వారు : "మంచి ప్రశ్న వేశావు. కాని, ఈ స్వాతంత్ర్యం ఒక సాధనం మాత్రమే. మనకు కావలసినది ఇంతకంటె ఇంకా గొప్పది. ప్రపంచానికంతా వెలుగు చూపించవలసిన బాధ్యత మన దేశానిది. స్వతంత్రులమైతే గాని ఆ పని చేయలేము మనం. స్వాతంత్ర్యం వచ్చాకనే మన అసలు పని ప్రారంభమవుతుంది" అన్నారు ఆయన 1918 లో.

1950 లో కాబోలు, ఆయనను తిరిగి దర్శించినప్పుడు ఎంతో మారిపోయారు. నాటి రాజకీయవేత్త ఈనాడు మహాయోగిలా కనిపించారు. బంగారపు దేహచ్ఛాయ, కళ్ళల్లో అనిర్వచనీయమైన వింత శోభ. మొదటి సమావేశంలో ఎంతో చనువుతో మాట్లాడిన ఆయన ఎదుట ఈమారు శిలా ప్రతిమలా నిలుచుండి పోయాను. దర్శనానికి నియమించిన రెండు నిమిషాలూ గడిచినట్లు తెలియదు. ప్రక్కన నిలుచున్న శ్రావకుడు భుజం తట్టి కదలమనే వరకు అల్లాగే చూస్తూ ఉండిపోయాను. అదే ఆఖరుసారి,